# రసికశ్రీ

చిన్నతనంలో నాకు పెంటయ్య అని నామకరణం చేశారు నా తలిదండ్రులు. దానికి ఒక కారణం ఉంది. నేను పుట్టక పుట్టక పుట్టడం, తరువాత పుట్టెడు జబ్బుతో మూల్గుతోండడం చూచి మావాళ్ళు దిగాలుపడ్డారుట నేను చచ్చిపోతానని. సృష్టిరహస్యాలు తెలుసుకున్న ఒక పెద్దమనిషి వచ్చి "చచ్చే వాళ్ళని ముఖ్యంగా చిన్నపిల్లల్ని పెంటమీద పారేస్తే బ్రతకడం కద్దు. అందుచేత కుఱ్ఱాడిని పెంటమీద పారేసిచూడండి బ్రతక వచ్చు అదృష్టముంటే" అని చెప్పాడట మా అమ్మ నాన్నతోటి. జబ్బుతోవున్న నన్ను ఒకరోజువరకు పెంటమీద పారెయ్యడం, ఆ తర్వాత నేను బ్రతకడం జరిగినతర్వాత, మా వాళ్ళు నాకు ముద్దుగా పెంటయ్య అని నామకరణం చేశారు.

నేను పెద్దవాణ్ణయ్యేక నాకు కొంచెం ఆశ్చరంవేసింది. 'పెంటమీద పారేసినంతమాత్రాన చచ్చేవాణ్ణి నేను ఎలా బ్రతుకగలిగానని.' కాని ఆ పెద్దమనిషి సమర్థించాడు. దేముడు కావాలి అన్నవాళ్ళకి ఏమీ యివ్వడని, అక్కర్లేదు అన్నవాళ్ళకి అన్నీ యిస్తాడని, అందుచేత అక్కర్లేదనే సూచకంగా పిల్లవాణ్ణి పెంటమీద పారేస్తే, బ్రతికించితీరడం దేముడి సహజగుణం కాబట్టి నేను బ్రతికేనని సెలవిచ్చాడు, ఆ పెద్దమనిషి దైవాన్ని పూర్తిగా అర్థంచేసుకున్న దగ్గరి స్నేహితుడిలాగ.

మా అమ్మ నన్ను ప్రేమతో 'పెంటి' అని పిలిచేది తనకి ఆడపిల్లలు లేకపోవడంవల్ల. మా నాన్న నన్ను 'పెంటూ' అని ఆప్యాయంగా పిలిచేవాడు నేను ఒక్కడినే కొడుకవడం వల్ల. పై వాళ్ళు 'పెంటయ్యా' అని పూర్తిగా పిలిచేవారు.

నన్ను ఎవరు ఏ పేరుతో పిలిచినా చాలాకాలంవరకు నా పేరు గొడవనే పట్టించుకోలేదు. కాని నేను క్రొత్తగా కాలేజీలో చేరడం, మొట్టమొదటిరోజు లెక్చరరు నా పేరు పిలవడంతో అంతా ఫకాలుమని నవ్వడం నాకు ఆశ్చర్యమేగాక చాల బాధ కలుగ జేసింది. రోజులు గడిచినకొద్దీ కనిపించిన కాలేజీపిల్లలంతా నన్నుచూచినవ్వడం మొదలు పెట్టారు. యింత మంది అస్తమానం నన్నుచూసి నవ్వడానికి బలవత్తరమైన కారణం ఏదో వుండివుంటుందని నిశ్చయించుకున్నాను.

ఒకరోజున ప్రక్కన కూర్చుంటూ చనువుగాఉన్న ఒక కుఱ్ఱవాడి నడిగాను. "ఎందుకయ్యా అందరూ నన్నుచూచి నవ్వుతున్నారని."

"నీ పేరు కొంచెం చిత్రంగావుంది. పైగా నీ వాలకం సరిగా నీవు సార్థకనామధేయుడవని చెపుతోంది. అదే కారణం" అని వాడుకూడ వెకవెకా నవ్వాడు

వాడినవ్వు నాలో అగ్నిగోళాలు పుట్టించింది. కనిపించిన వాడికల్లా వేళాకోళమే నేనంటే. నాపేరు బాగులేదుట! పైగా నా వాలకం సరిగా "పెంటయ్యా"లాగుందట.

నాలో అంత అందవికారత ఏముందా అని ఒకసారి విమర్శనా దృష్టితో నా శరీరంలోకి చూసుకున్నాను. నెత్తిమీద వెంట్రుకలు ఎప్పుడూ నిలిచి ఉంటాయి. ఎంతదువ్వినా, ఎంత పెరిగినా, ఎందుచేతో వొంగవు. అది నా వెండ్రుకల తత్త్వం. అదే నన్నుచూచి అందరూ నవ్వడానికి కారణమైతే నేనేం చెయ్యగలను! ఆ నిటారు వెండ్రుకలు లేకుండా ఉండాలంటే గుండు చేయించుకోవడమే ఒక మార్గం. గుండు చేయించుకోడం మా యింట్లో అప్పుడే మానేసి మూడు తరాలయింది. పైగా క్రాపింగులు మోజు కల్గిన యీ రోజుల్లో గుండు చేయించుకుంటే మరీ నవ్వులపాలవను! అందుచేత ఆ ప్రయత్నం మానేశాను.

నాకున్న బట్టలన్నీ మూడేరంగులు. ఎరుపు, నలుపు, కాకీ. మాపుకాగి చాలాకాలం మన్నుతుంటని, గుత్తగా రెండు తానులు దళసరిగుడ్డ లాగులు, చొక్కాలు కుట్టించేవాడు మా నాన్న. డబ్బు ఆట్టే లేకపోవడంవల్ల కొంచెం జాగ్రత్తగా వాడటం మా నాన్న కలవాటు. ఎప్పుడూ ఎఱుపు, నలుపు, కాకీరంగు ముతకలాగూ చొక్కాల్లో కనిపించడంవల్ల అందరూ నవ్వుతే నవ్వవచ్చు. యింతకన్న మంచిబట్టలు కుట్టించమంటే మా నాన్న తన దగ్గర ఆట్టే డబ్బు లేందటాడేమో! అయినా తను ఒక్కడే కొడుకవడంవల్ల, చచ్చిపోతానని బెదిరిస్తే, తప్పక

కొంచెం మంచిబట్టలు కుట్టించవచ్చుని నాకు ధైర్యం కలిగింది. అందుచేత మంచి బట్టలు తొడుక్కోగలనని ఒక ఆశ కలిగింది.

నా కాలు కొంచెం కుంటి. అది నాకు జన్మదగ్గరనుంచి వచ్చిన వికారం. మా నాన్నకూడా కుంటివాడే. అందుమూలాన నాకు కుంటి వచ్చిందట. నన్నుచూచి నవ్వడానికి నా కుంటే కారణమయితే దానికి నేనేం చెయ్యగలను! అక్కడికే అతి కష్టంతో కుంటితనం లేనట్టు నటిస్తూ నడుస్తున్నా.

నాకు ఒక కన్ను గుడ్డి. అది నా తప్పుకాదు. నాకు చిన్న తనంలో పెద్ద జబ్బుచేసినపుడు మసూచికం రావడం, దానివల్ల నా కన్నుపోడం జరిగింది. యిదేవిధంగా పెళ్ళయినాక మా అమ్మకుకూడా ఒక కన్ను గుడ్డిదైంది. మా అమ్మకువచ్చిన పోలికే నాకూ రావడంవల్ల కొంతమంది నన్ను అదృష్టవంతు డనేవారు. కాని యింతమంది కాలేజీపిల్లలు ఒక్కసారి నన్ను చూసి నవ్వుతూంటే అదృష్టమేమిటి? అనిపించేది. అయినా ఖర్మంకాలి అష్టవక్రితకు సానుభూతి చూపించవలసింది మాని అందరూ నవ్వుతూంటే వీళ్ళు మానవులా అనిపించేది నాకు. అయినా యీ గుడ్డికన్ను ఆట్టే అందరికీ తెలియకుండా మా నాన్న యిచ్చిన తాతలనాటి తెల్లఫ్రేము కళ్ళజోడు ఒకటి పెట్టుకున్నాను.

నాకు ముఖంనిండా మసూచిక మచ్చలు గంట్లుదేరాయి. అయినా అవి కనిపించకుండా వీలయినంతవరకు స్నో రాసుకుని పూడ్చుకుందామని నిశ్చయించాను.

తరువాత నా పేరు ఏం చేయనా అని ఆలోచించాను. పేరు మార్చుకుంటే బాగుంటుందా అని ఆలోచిస్తూంటే ఒక పేరు తట్టింది. అది అన్నివిధాలా నాకు అనుకూలంగా ఉంటుందని నమ్మాను

నాకు చిన్నప్పటినుంచి అతి ఖులాసాగా, ఆనందంగా ఉండాలని కోరిక. జీవితంలో ఏమి అడ్డువచ్చినా నా ఆనందం మాత్రం నిరాటంకంగా సాగిపోవాలని నా ఆశయం. నేను కాలేజీలో చేరేముందు అనేక కథలు, కావ్యాలు చదివాను. ఎందుకో ప్రేమకథలు నన్ను ఆకర్షించాయి. ఆ కథల్లో నాయకులు చేసే ఘట్టాలు నాలో నూత్నచైతన్యం కలిగించాయి. జీవితంలో నేనుకూడా ఒక ప్రేమనాయకుడుగా ప్రసిద్ధికెక్కి, కథల్లోదూరి, అమరత్వం పొందాలని గాఢమైన కోర్కెతో గంతులు వేసేవాణ్ణి.

నా ఆశయాలకు తగ్గట్టుగా "రసిక(శ్రీ)" అని పేరు పెట్టుకుంటే బాగుంటుందనిపించింది. అప్పుడు నా ఆశయాలు అమలులో పెడితే సార్థకనామధేయుణ్ణి కాగలనని ఎంతో సంతోషించాను.

మర్నాడు మా నాన్నదగ్గరికి వెళ్ళి చెప్పాను. కాలేజీలో నన్నుచూచి అందరూ నవ్వుతూన్న విషయం...దానివల్ల నా హృదయబాధ—ఆ తర్వాత జరిగిన నా నిర్ణయం. ఒక్కణ్ణే కొడుకుననే ప్రేమచేతనైతేనేమి, నా బాధచూసి జాలిపడ్డైతేనేమి, దాచిదాచి ఉంచిన పదిరూపాయిలిచ్చాడు నాకు కాలేజీలో పేరు మార్పించుకోమని.

నా పేరు మారింది. లెక్చరరుగారు నన్ను "రసికశ్రీ" అని పిలిచారు. క్లాసులో పేరు మారిన మర్నాడు అందరూ ఆశ్చర్యపోయారు. ఎవరీ "రసికశ్రీ" అని. నేను లేచి నుంచున్నాను అందరూ నా క్రొత్తపేరు తెలుసుకోవాలని. తిరిగి అంతా ఫకాలుమని నవ్వారు. నాకు ఒళ్ళు మండిపోయింది. పేరు మార్చుకున్నాను. కొంచెం మంచిబట్టలుకూడా వేసుకున్నాను. ఇంకా నవ్వెందుకో వీళ్ళకి, అని నాకు చాలా ఉక్రోషంవచ్చింది. వీళ్ళకి తగినశాస్తి చెయ్యాలంటే వాళ్ళని చూచి నేనూ నవ్వాలనిపించింది. వాళ్ళతోపాటు నేనూ ఫకఫకా నవ్వేశాను. నేనంటే కొంచెం అభిమానమున్న ఒక కాలేజీ కుర్రాడు "యిటువంటి నవ్వులు మనం పట్టించుకోకూడదు. కాలేజీపిల్లలకు వెకిలిగా నవ్వడం అలవాటు" అని నాకు నీతి బోధించాడు. వాడి నీతిలో నాకు చాలా సత్యం కనిపించింది.

కొంతమంది నన్ను ప్రశ్నించారు. 'తల్లిదండ్రులు ప్రేమతో పెట్టినపేరు రద్దుచేసి "రసికశ్రీ" అని పేరెందుకు మార్చుకున్నావని'. నేను పేరులోని గొప్పతనం వివరించాను. "నా ఆశయాల ప్రతిబింబం నా పేరులోని "రసికశ్రీ" అనే మొదటి మూడక్షరాలు. నా లోది 'శ్రీ' నా సృష్టి. యింత కాలం అందరూ పేర్ల చివర రావు, మూర్తి, శర్మ, శాస్త్రి, అయ్య, అప్ప అని పెట్టుకుంటె నవ్యత్వంకోసం నేను చివర నాల్గో అక్షరం 'శ్రీ' అని తగిలించాను. ఏదైనా నవ్యత్వం ఉంటే అందరికీ ఒక విధంగా మోజుకుదిరి నేను ఆకర్షింపబడ

తానని ఆశ" అని. కొంతమంది నిజంగా నా తెల్వితేటలు ప్రశంసించారు. కొంతరు నన్నుచూచి మరీ నవ్వారు. ప్రపంచంలో ఏ విషయానికైనా ప్రశంసించేవారు, ద్వేషించేవారు అనే రెండు తెగలుండడం సహజం అని నాలోనేను సమాధానపర్చుకున్నాను.

"రసిక శ్రీ" అని పేరుపెట్టుకున్నాక నా ఆశయాలు ఆలస్యం చేయకుండా అమలులో పెట్టాలని తహతహలాడాను. కనిపించిన స్నేహితులముందు కొంచెం కావ్యభాషలో మాట్లాడేవాణ్ణి. కాలేజీ అమ్మాయిలతో పరిచయమున్న అబ్బాయిల స్నేహంకోసం పాకులాడేను. చాలామంది నన్ను చీదరించుకున్నా ఒక విద్యార్థి నాయకుడు మాత్రం నాలో ఏదో ఒక క్రొత్తదనం వుందని గుర్తించి నన్ను అప్పుడప్పుడు దగ్గరకు రానిచ్చేవాడు.

కావ్యాల్లో, కథల్లో వ్రాసిన రసికత్వం, స్త్రీల అందచందాల వర్ణనలు అతి ఓపిగ్గా చదివాను. నా రసికత్వం ఉత్తమమైనదిగా ఉండాలని నిర్ధారణ చేశాను. నేను పొందే స్త్రీ అప్సరసగా వుండాలని నిశ్చయించుకున్నాను.

కావ్యాల్లో వర్ణించినంత అందచందాలు కాకపోయినా అందులో ఒక సహస్రాంశమయినా నాకు ఎదురుగా కనిపించే అమ్మాయిలలో కనిపించేదికాదు. గాని నేను పెట్టుకున్న ఆశయం ఉన్నతంగా వుండడంవల్ల ఆ ఎత్తునుంచి క్రిందకు దిగిరావడం మంచిదిగా కనిపించలేదు. ఎందుచేతంటే అత్యున్నత ఆశయాలు పెట్టుకుని కష్టపడితే, చివరకు ఆ ఆశయాలు పొందకపోయినా,

అధమం వాటిదగ్గరగానైనా జేరుతాము. అది కొంతవరకు హృదయానందం.

నేను క్రమంగా పెరిగి పెద్దవాణ్ణయిపోతుంటే, మా నాన్న అమ్మ నన్ను పెళ్ళిచేసుకోమని బలవంతపెట్టారు. నాకు చాలా బాధగావుండేది; పెళ్ళిచేసుకుని సంసారబంధాల్లో పడితే ఏ ఆశయం సిద్ధిస్తుందని! నేను వీలైనంతవరకు సంబంధాలు చూడననేవాణ్ణి. తప్పనిసరిగా బలవంతపెడితే ఒక్కొక్కసారి చూసేవాణ్ణి కొన్ని సంబంధాలు. నేనుచూసిన సంబంధాలన్నీ ఏమిటో చిత్రంగా వుండేవి ఒక్క అమ్మాయీ బాగుండేది కాదు, కావ్యాలు చదివాక నా ఆశయంగా సృష్టించుకున్న స్త్రీ దివ్యభవనాల్లో నివసిస్తూ, గండుతుమ్మెదలవంటి కన్నులు, మెరుపుతీగవంటి శరీరం, నిండు చందురువంటి మందస్మిత వదనం, దొండపండు పెదిమలు, గురుజఘనం మొదలైన లక్షణాలు కలిగి వుండాలి. కానీ యీ లక్షణాలేవీ ఆ అమ్మాయిలలో కనిపించేవి గావు. వాళ్ళకి ఉతికినబట్టలు కట్టించి, పువ్వులుపెట్టి అలంకరించి చక్కగా తోలుబొమ్మల్లా ఒకచోట కూర్చోపెట్టేవారు. అందులో కొంతమందికి తొర్రిచెవులు, తప్పడముక్కులుకూడా వుండేవి. నేను వూహించుకున్న స్త్రీకి వాళ్ళకి సహస్రం వ్యత్యాసముండేది.

నేను చూసిన సంబంధాలవాళ్ళ యిళ్ళన్నీ యీగలతో, దోమలతో ముసురుతూండేవి. వాళ్ళుండేవి పట్నవాసాలవడం వల్ల ఇరుకుసందుల్లో చిన్నచిన్న గదుల్లో నివసించేవారు యిళ్ళు

దొరక్క. ఇవన్నీచూసి చిరాకెత్తి ఏదో వంకపెట్టి ఏ అమ్మాయి నచ్చలేదనేవాణ్ణి. నేను పిల్ల నచ్చలేదన్న తర్వాత 'వాడు మహా బాగున్నాడు లెద్దు!' అని నా అందవికారంగూర్చి తీవ్రంగా విమర్శిస్తూ నా వెనకాల చిందులు తొక్కే-వారు ఆ సంబంధాలు. ఇటువంటి మంచి సంబంధాలు వదులుకుంటే మనవంటి బీదవాళ్ళకి ఇంక సంబంధాలు వస్తాయిరా! అని కేకవేసేవాడు మా నాన్న.

ఏది ఏమైనా నిత్యం నా ఆశయసిద్ధికోసం నేను తాపత్రియపడేవాణ్ణి. ఇలావుండగా ఒకనాడు నాకు ఒక అమ్మాయితో పరిచయం కలిగింది. అంటే ఏ ఆధునిక అమ్మాయిలు నన్నుచూచి సరిగా పలకకుండా వుంటూంటే, ఒక అమ్మాయి నేను మాట్లాడగానే మాట్లాడింది. ఆ అమ్మాయి నేను చదివే కాలేజీలోనే చదువుతూండేది. ఎందుచేతనోకాని నాకు ఆ అమ్మాయిలో కొంత అందం కనిపించింది. నేను పెట్టుకున్న ఆశయం సిద్ధిస్తుందని, నా కొత్తపేరు సార్థకమవుతుందని ఉబలాట పడేవాణ్ణి.

ఆ అమ్మాయే అప్సరసలా, రంభలా, వరూధినిలా నా కలలో కనిపించేది. ఒకసారి మా నాన్నతో యీ సంగతిచెప్పి ఆ అమ్మాయిని నాకిచ్చి పెళ్ళిచేయించు అని అడుగుదామనుకున్నా. కాని ఆ అమ్మాయి హృదయం తెలుసుకోకుండా తొందరపడకూడదని తలచాను.

ఆ అమ్మాయి ఒక్కసారి ఓ రోజు మాట్లాడింది — అదైనా నే పలకరిస్తేనే. తర్వాత చాలాసార్లు ఆమెను కలుసుకో దలచాను. ఆమెకు వీలులేకపోయింది నాకు కనిపించడాన్కి. నాకూ వీలులేకపోయింది ఆమెను చూడడాన్కి. కాని నా ఆశయం తల్చుకున్నప్పుడల్లా ఆమె నా మనస్సులో గబుక్కున కన్పించడం, ఆమెను తల్చుకున్నప్పుడల్లా నా ఆశయాలు ప్రజ్వరిల్లడం జరుగుతూండేది.

ఒకసారి నా హృదయబాధ చెప్పుకోలేక చెప్పుకోలేక ఒక తోడిమనిషితో చెప్పుకున్నా. వాడు 'ఆ అమ్మాయికి పెదిమలమీద బొల్లి, బోదకాలు, మెల్లకన్ను వున్నాయిరా! ఎల్లా ప్రేమించేవు?' అని ఎగతాళిచేస్తూ వాడుకూడా పకపక నవ్వడం మొదలుపెట్టాడు.

నాకు చాలా బాధకలిగింది వాడికెందుకు చెప్పానా ఆ విషయం అని ఆ అమ్మాయికి మెల్లకన్నట! ఏమోనని, నిజంగా ప్రేమవొలికిస్తూ క్రీగంట చూస్తున్నట్టు నాకు కనిపించేది. ఆమె పెదిమలమీద బొల్లి వుందేమోకాని, అది నాకు చిఱు నవ్వు వెన్నెలలా కనిపించేది. ఆమెకు బోదకాలైతేనేం! నడక మత్తేభయానంలా వుండేది. యీ విమర్శకులకు అందం అర్థం చేసుకోడం తెలియదనుకున్నా.

ఆమెనుగురించి రోజూ జోరుగా కలలు కనేవాణ్ణి. ఆమె నన్ను 'ఓ ప్రియా' అన్నట్టు, నేను ఆమెను 'ఓ ప్రేయసీ' అన్నట్టు కలలు వచ్చేవి. అటువంటి తీయని కలలకోసం పగలు

నిద్రరాకపోయినా నిద్రపో ప్రయత్నించేవాణ్ణి. అటువంటి కలలు రావడం మంచిది కాదనేవారు కొందరు సనాతనులు. కాని నేనూ సనాతనుణ్ణే! ఆత్మ, శరీరం వేరు అని విచక్షణజ్ఞానం కలిగిన నేను అది నా తప్పుకాదని, శరీరం తప్పని ధృవపరిచాను.

నా కాలేజీ చదువయిపోయింది. కాని ఆ అమ్మాయితో తిరిగి మాట్లాడే అవకాశం కలగలేదు. కొన్నిరోజుల తర్వాత వాకబుచేస్తే ఆ అమ్మాయికి పెళ్ళయిపోయిందని విన్నాను. ఊసురుమంటూ విరహవేదనతో చాలాకాలం చాలా అవస్థ పడ్డాను.

ఇంక యిల్లావుంటే లాభంలేదనుకున్నాను. కావ్యాల వర్ణనలే పట్టుకు కూర్చోకుండ కొంచెం నవీనపద్ధతులలో రసికత్వం నేర్చుకోవాలనుకున్నా. సినీమాలలో యీ పద్ధతులు చాలా చూపిస్తారని అవి చూడడంవల్ల యీ విజ్ఞానం పెరుగుతుందని ఒక విజయుడైన ప్రేమికుడు చెప్పాడు.

నేను విరివిగా సినీమాలు చూడసాగాను. సినీమా కథల్లో నాయకి, నాయకుడుపై కారు పోనివ్వడం, ఆ కారణంగా నాయకీనాయకులు కలుసుకోవడం, ఆపైన వారి స్నేహం ప్రేమగామారి పెండ్లికావడం, చూపించేవారు. యీ పద్ధతి బాగుందనిపించింది. ఎటొచ్చి నాయకుడు ధైర్యం వహించి కొంచెం కళ్ళుమూసుకుని కారుకింద పడిపోవాలి! అంతే. చాలాసార్లు నవయావన స్త్రీలు వెళ్ళే కార్లుకిరింద పడిపోవాలనిపించింది. నిజంగా ప్రయత్నించానుకూడ. కాని కరుణ

కలిగిన ఏ స్త్రీ నాపై కారు పోనివ్వలేదు. పైగా కారు ఆపి, నన్ను కసిరి కోపంకళ్ళతో ఉరుముతూ పోయేవారు.

నాకు తెలిసిన ప్రపంచంలో నేను రసికత్వం అమలులో పెట్టడానికి చేసిన ప్రయత్నాలు వ్యర్థమయ్యాయి. పెళ్ళిచేసుకుని రసికత్వం ప్రథమయత్నంచేసి, సార్థకనామధేయుణ్ణి అవుతే బాగుంటుందని ఆలోచిస్తున్నాను.

ఇంతలో ఒక్కరోజే హఠాత్తుగా మా నాన్న, అమ్మ పాము కరవడంవల్ల చచ్చిపోయారు. మా నాన్న కష్టపడి మిగిల్చిన కొంచెం డబ్బు దహనక్రియలకు సరిపోయింది.

చదివిన చదువుతో కష్టపడి ఒక గుమస్తా ఉద్యోగం సంపాదించుకున్నా. పెళ్ళిచేసుకోవాలని నాకు చాలా పట్టుదల కలిగింది. నేను చాలా సంబంధాలు త్రిప్పేయడంవల్ల నాకు బాగా వయస్సు ముదిరిపోవడంవల్ల ఏ సంబంధాలు రావడం మానేశాయి. అక్కడికీ ప్రచారంకోసమని, నల్గురికీ తెలుస్తే కొన్ని సంబంధాలు రావచ్చుని—పెద్దల చెవిని వేశాను పెళ్ళిచేసుకోవాలని వుందని. కాని ఎన్నాళ్ళకీ ఏ సంబంధాలు రాలేదు. మా నాన్న అమ్మ బ్రతికివుంటే ఏదో సంబంధం చూసి ముడిపెట్టకపొయ్యేవారా అని ఎంతో యిదయ్యేవాణ్ణి.

ఇంక యిది పనిగాదని నా వేలువిడిచిన పినతండ్రి ఒకాయనదగ్గరికి వెళ్ళి పెళ్ళి చేయించిపెట్టమని మొఱపెట్టుకున్నా. ఆయన దయదలిచి సరే అన్నాడు.

ఒకరోజు ఒక సంబంధం తీసుకువచ్చాడు ఆయన. వాళ్ళకి ఆట్టే ఆస్తిలేదు. 'కట్నం యివ్వం కావలిస్తే పిల్లని పెళ్ళిచేసుకో

వచ్చు' అన్నారు. పిల్ల పొట్టిగా, లావుగా కుదుంలావుంది. వయస్సు ఇంచుమించు నా అంత అన్నారు. ఏది ఏమైనా పెళ్ళి చేసుకోడం ముఖ్యంలా కనిపించింది. ఇది తప్పిపోతే మళ్ళీ సంబంధాలు వస్తాయో రావో అని భయంవేసింది. ఆ అమ్మాయిని పెళ్ళిచేసుకోడానికి ఒప్పుకున్నాను.

నాకు అందం అంటే ఎంత ఆదరణవుందో, మా ఆవిడకు అంత నిర్లక్ష్యం. తల దువ్వుకునేది కాదు. మంచిబట్టలు కట్టుకునేది కాదు. ఏమిటి సంగతి అని అడిగాను. "అందరు స్త్రీలు ఫలాలు, పుష్పాలు మొదలైన వ్రతాలు చేసుకున్నట్టు నాకు పెళ్ళయితే తల దువ్వుకోక, మంచిబట్టలు కట్టుకోక జీవితాంతం దాకా ఉండే వ్రతం పడతానని మహాలక్ష్మీదేవిముందు మ్రొక్కుకున్నానని' చెప్పింది మా ఆవిడ. నాకు ఆశ్చర్యం భయం వేసింది దీనితో కాపురంచేయడం ఎలాగా అని. చూడడానికి తల విరియబోసుకుని మాసినగుడ్డలతో మహాభూతంలా కనిపించేది; పైగా ఆమె కాపురానికి వచ్చాక దినదిన ప్రవర్ధమానంగా అడ్డంగా పెరిగిపోవడం మొదలుపెట్టింది.

అడ్డంగా రోజురోజూ అనంతంగా పెరిగిపోతూండడం వల్ల, మా ఆవిడ శరీరం చెప్పలేనంత బరువెక్కిపోయింది. ఆ శరీరం కదపడమే ఆమెకు శక్యం కాకపోతూంది. ఆమె కూర్చున్న చోటునుంచి కదలలేకపోవడంవల్ల నేనే యింట్లో పనులన్నీ చూసుకోవలసివచ్చేది.

కాలం గడిచినకొద్దీ, నాకు పిల్లలు పెరిగిపోతున్నారు. నాకు వయస్సు పెరిగిపోతోంది. మా ఆవిడ లావెక్కిపోతూంది. నేను సన్నబడిపోతున్నాను. నా ఆదాయం చాలటంలేదు సంసార యాత్ర చేయడాన్కి. నాకు నాజీతం కెందుకో అర్థమవటంలేదు.

నేను ఆఫీసునుంచి వచ్చి ఇంట్లోపడగానే, మా ఆవిడ వచ్చి గుమ్మంముందు ద్వారానికంతకీ ఒక పెద్దబిరడాలా కూర్చుంటుంది ఇంక నేను బయటికి పోకుండా. దీనివల్ల రాత్రిపడక పోయినా ఇంక సూర్యకాంతి యింట్లోకిరాక చీకటి ఆవరిస్తుంది. ఆ చీకటియింట్లో నా పేరు సార్థకంచేసుకునే ప్రయత్నంలో పుట్టి పెరుగుతూన్న సంతానం మంచిచెడ్డలు సవరించుకుంటూ వుంటున్నా.

నేను చదివిన ప్రేమకావ్యాలు, కథలు, వృథా అనిపించాయి. నా ఆశయాలు గాలిలో మేడలనిపించాయి. నేను క్రొత్తగా పెట్టుకున్న పేరు వ్యర్థమనిపించింది.

పేరు మార్చుకుంటే బ్రహ్మవ్రాత మారుతుందా అని కొంతమంది ఎగతాళి చేసేవారు నన్ను. కాని కొంతమంది పునర్జన్మలో నమ్మకము ఉన్నవాళ్ళు నాకు ధైర్యం కలిగించేవారు. ఆశలు జీవితాంతందాక అనుసరించి, అనుభవించలేక పోతే, అవి అనుభవించడానికై నా పునర్జన్మ కలుగుతుందని. అందుచేత నేను పునర్జన్మకోసం ఎదురుచూస్తున్నాను.